జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 21 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5



## ఐడిఓసిలో నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశం

- నేడు ప్రజావాణి రద్దు జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 20 ,(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ , ఐదుగురు సభ్యుల బృందం ఈ నెల 21న జిల్లాలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీలు, భూ సమస్యలు, ఆర్ఓఆర్ అమలు తదితర అంశాలపై జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, ప్రతి సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని (సోమవారం) రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషన్ సమీక్ష సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు . కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి నేడు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ అంకిత్ సూచించారు.




# మణుగూరులో నిషేధిత గోరి క్రీమ్ దందా...

- ₹ 1500 నుంచి ₹ 2000 వరకు చీకటి వ్యాపారం...
- పాకిస్తాన్ లో తయారయ్యే గోరి క్రీమ్‌లో ప్రమాదకర మెర్క్యురీ...
- వాడితే కిడ్నీ ఫెయిల్యూర్ ఖాయం...
- తెల్లగా కావాలని క్రీమ్ వాడితే ఏకంగా కోమా లోకే..!
- నిషేధం ఉన్నా సరే రహస్యంగా మణుగూరులో అమ్ముతున్న కొందరు వ్యాపారస్తులు...
- ఎఫ్డీఏ నిషేధించినా ఆగని గోరి దందా...
- అధికారులు తనిఖీ చేసి వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజానీకం...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి :** – అందం పేరుతో గోరి క్రీమ్ ను మార్కెట్ లోకి తీసుకువచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఘటన భద్రాద్రి జిల్లా మణుగూరు మండలంలో వెలుగుచూసింది. పాకిస్తాన్‌లో తయారయ్యే,పలు రాష్ట్రాల్లో నిషేధించిన గోరి బ్యూటీ క్రీమ్ ను మణుగూరు మండలంలో ఉన్న కొందరు ఫాన్సీ దుకాణాల వ్యాపారస్తులు, మరికొందరు వ్యక్తులు దొంగతనం గా మణుగూరుకు తెచ్చి భారీ ధరలకు అమ్ముతున్నారు. ఒరిజినల్ ధర ₹ 300 నుంచి ₹400 వరకు ఉన్న ఈ క్రీమ్ ను ₹ 1500 నుంచి ₹2000 వరకు అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారు.ఈ క్రీమ్ నిషేధిత ఉత్పత్తి అని తెలిసినా లాభాల కోసం రహస్యంగా విక్రయిస్తున్నారని స్థానికుల్లో చర్చ జోరుగా జరుగుతోంది.

**బ్యూటీ పార్లర్లే సెంటర్లుగా మారాయి...**

ఈ దందాలో ఎక్కువగా బ్యూటీ పార్లర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలుస్తోంది. కొందరు ఫాన్సీ వ్యాపారస్తులు నేరుగా బ్యూటీ పార్లర్ నిర్వాహకులకు ఈ క్రీమ్ ను సరఫరా చేస్తున్నారని వినపడుతోంది.త్వరగా ఫెయిర్ అవుతుందని మహిళా కస్టమర్లను నమ్మించి పార్లర్లలోనే విక్రయిస్తున్నారు.సోషల్ మీడియాలో కూడా వాట్సాప్ గ్రూప్‌లు,ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ఆర్డర్లు తీసుకుంటున్నట్లు కొంత సమాచారం.దీంతో మణుగూరు చుట్టుపక్కల

మిగతా 2 లో...

## రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం కదలిక




- మంత్రి తుమ్మల విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- త్వరలో ప్రారంభం కానున్న పాండురంగాపురం-సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పనులు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 20,(ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంత ప్రజల చిరకాల రైల్వే కల సాకారం దిశగా కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించింది. పాండురంగాపురం–సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాష్ట్ర మంత్రి తుమ్మల

మిగతా 2 లో...

## భూభారతి పైలెట్ ప్రాజెక్టుకు
# సర్వే ( కొరత ) శాపమా?

- అశ్వారావుపేట రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్ కొరత.. నెలల తరబడి రైతుల నిరీక్షణ
- రెగ్యులర్ సర్వేయర్ లేక అవస్థలు
- దమ్మపేట సర్వేయర్ కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగింత
- భూమిసర్వే కోసం ఎదురుచూపులు సర్వేయర్ మాత్రం ఖాళీ లేదు.. అదనపు వసూళ్ల ఆరోపణలు.. ఆగిపోయిన భూ లావాదేవీలు?



**అశ్వారావుపేట,సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమం లక్ష్యాలు క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో నీరుగారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా భూముల సర్వే, రికార్డుల పరిశీలన, కొలతలు, హద్దుల నిర్ధారణ, రిజిస్ట్రేషన్ వివరాల్లో మార్పులు వంటి ప్రక్రియలు సక్రమంగా నిర్వహించి సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు పంపాల్సి ఉండగా.. అశ్వారావుపేట రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్ కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు చెబుతున్నారు.

**సర్వేయర్‌లేక.. ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారా?**

అశ్వారావుపేట రెవెన్యూ కార్యాలయంలో పూర్తిస్థాయి సర్వేయర్ లేకపోవడంతో అవసరమైన సమయంలో ఇన్‌చార్జి సిబ్బందిపై ఆధారపడాల్సి వస్తోందని సమాచారం. దీంతో భూ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.
"ఖాళీ ఉన్నప్పుడు చూస్తాం" అన్న సమాధానం

మిగతా 2 లో...

## భూభారతి పైలెట్ ప్రాజెక్టుకు సర్వే ( కొరత ) శాపమా?

(మొదటి పేజీ తరువాయి...)

అధికారుల నుంచి ఎదురవుతోందని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

**సర్వేకు అదనపు భారం?**

భూ సర్వే కోసం ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ మొత్తం అధికారిక రుసుమా? లేక అనధికారిక వసూళ్లా? అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు ఉంటే దానికి సంబంధించిన వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలని రైతులు కోరుతున్నారు.

**కంప్యూటర్ ఆపరేటర్ లేక.. పనులు మరింత ఆలస్యం?**

రెవెన్యూ కార్యాలయంలో భూ రికార్డుల సంబంధిత కంప్యూటర్ పనులకు అవసరమైన సిబ్బంది కొరత కూడా సమస్యగా మారిందని తెలుస్తోంది. గతంలో పనిచేసిన ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ ప్రమాదానికి గురై కొంతకాలంగా విధులకు హాజరు కాలేకపోతున్నారని సమాచారం. దీంతో ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో భూ రికార్డుల పనులు మరింత ఆలస్యమవుతున్నాయని రైతులు అంటున్నారు.

**వారసత్వం.. సక్సెషన్.. ఆన్‌లైన్ లావాదేవీలకు బ్రేక్?**

సక్సెషన్, వారసత్వ మార్పులు, ఆన్‌లైన్ భూముల కొనుగోలు–అమ్మకాలకు సంబంధించిన ప్రక్రియలు సైతం ఆలస్యమవుతున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. భూమి లావాదేవీలు నిలిచిపోవడంతో అత్యవసరంగా భూమి విక్రయించాల్సిన వారు, కొనుగోలు చేయాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**పైలెట్ ప్రాజెక్టు మంచిదే.. అమలే ప్రశ్నార్ధకం**

భూ రికార్డులను పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన భూభారతి వంటి కార్యక్రమం లక్ష్యం మంచిదేనని రైతులు అంటున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో అవసరమైన సిబ్బంది, సాంకేతిక సౌకర్యాలు లేకపోతే పథకం లక్ష్యం ఎలా నెరవేరుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇంతకుముందు భూమి విలువకు సంబంధించిన చెల్లింపులు, ఇతర ప్రక్రియలను రెవెన్యూ కార్యాలయంలోనే నిర్వహించుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం సర్వే వంటి ప్రక్రియలకు అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల దృష్టి ఎప్పుడు?**

ప్రతిష్టాత్మకమైన పైలెట్ ప్రాజెక్టు అమలవుతున్న ప్రాంతంలోనే సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ వంటి కీలక సిబ్బంది కొరత ఉంటే భూభారతి లక్ష్యాలు ఎలా నెరవేరుతాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సిబ్బందిని తక్షణమే నియమించి పెండింగ్‌లో ఉన్న సర్వేలు, వారసత్వ మార్పులు, సక్సెషన్, భూ లావాదేవీల దరఖాస్తులను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## మణుగూరులో నిషేధిత గోరి క్రీమ్ దందా...

(మొదటి పేజీ తరువాయి...)

గ్రామాల మహిళలు కూడా ఈ ఉచ్చులో పడ్డారని వినిపిస్తోంది.




**కిడ్నీ ఫెయిల్యూర్ వరకు ప్రమాదమని వైద్యుల హెచ్చరిక...**

వైద్య నిపుణులు మాత్రం ఈ క్రీమ్ వాడొద్దని గట్టిగా హెచ్చరిస్తున్నారు. గోరి క్రీమ్‌లో ప్రమాణాలకు మించి మెర్క్యురీ ఉందని, దీర్ఘకాలం వాడితే కిడ్నీల ఫిల్టరింగ్ దెబ్బతిని "మెంబ్రేనస్ నెఫ్రోపతి" అనే వ్యాధి వస్తుందని చెబుతున్నారు.హాంకాంగ్,ఫిలిప్పీన్స్ లాంటి దేశాల్లో ఇప్పటికే ఈ క్రీమ్ వల్ల కిడ్నీ సమస్యలు,కోమా కేసులు రిపోర్ట్ అయ్యాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యం గా గర్భిణీలు వాడితే పుట్టబోయే బిడ్డకు కూడా నరాల సమస్యలు వస్తాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల్లో రైడ్స్,కేసులు...**

మహారాష్ట్ర,ఫిలిప్పీన్స్ ఇతర రాష్ట్రాల్లో ఈ క్రీమ్ నిషేధిత జాబితాలో ఉంది.పోలీసులు రైడ్స్ చేసి వ్యాపారస్తులను అరెస్ట్ చేసి కేసులు కూడా నమోదు చేస్తున్నారు. చట్టప్రకా రం నిషేధిత కాస్మెటిక్స్ అమ్మితే 10 ఏళ్ల వరకు జైలు శిక్ష, లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది.అయినా మణుగూరులో మాత్రం ఇంకా ఈ దందా ఆగడం లేదు.

**అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి...**

గోరి క్రీమ్ అమ్మకంపై డ్రగ్స్ కంట్రోల్,పోలీస్, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి మణుగూరులోని ఫాన్సీ దుకాణాలు,బ్యూటీ పార్లర్లపై తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, మహిళలకు ఇలాంటి కల్తీ క్రీమ్‌ల ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

# రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం కదలిక

(మొదటి పేజీ తరువాయి...)

నాగేశ్వరరావుకు హామీ ఇచ్చారు. ఇటీవల మంత్రి తుమ్మల రాసిన లేఖకు స్పందించిన కేంద్ర మంత్రి ఫోన్‌లో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్నరైల్వే అంశాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశవ్యాప్తంగా భక్తులు, యాత్రికులు వస్తుంటారని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. పాండురంగాపురం–సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పూర్తయితే భద్రాచలం వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి, యాత్రికుల సౌకర్యానికి ఈ రైల్వే మార్గం ఎంతో కీలకమని పేర్కొంటూ పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అశ్విని వైష్ణవ్ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**సత్తుపల్లి–కొవ్వూరు రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి**

సత్తుపల్లి–కొవ్వూరు రైల్వే లైన్ ఇప్పటికే రైల్వే బడ్జెట్‌లో ప్రకటించబడినప్పటికీ, నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని మంత్రి తుమ్మల కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇదే సమయంలో కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రైల్వే లైన్ నిర్మాణం ఇప్పటికే చేపట్టిన విషయాన్ని మంత్రి తుమ్మల వివరించారు. కొత్తగూడెం–సత్తుపల్లి రైల్వే అనుసంధానం ఉన్న నేపథ్యంలో సత్తుపల్లి–కొవ్వూరు మార్గం పూర్తయితే ఈ ప్రాంతం మరింత విస్తృత రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమవుతుందని తెలిపారు.

**పెనుబల్లి–కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గానికి మంజూరు కోరిన మంత్రి తుమ్మల**

పెనుబల్లి నుంచి కొండపల్లి (అమరావతి) వరకు కొత్త రైల్వే మార్గాన్ని మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కేంద్ర రైల్వే మంత్రిని కోరారు. ఈ మార్గం ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం ప్రాంతం నుంచి అమరావతి వైపు ప్రయాణించే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు.సత్తుపల్లి–కొవ్వూరు మార్గానికి నిధుల మంజూరు, పెనుబల్లి–కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గం మంజూరుకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను పంపిస్తామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు.

**భద్రాద్రి–ఉమ్మడి ఖమ్మం ప్రాంత అభివృద్ధికి రైల్వే అనుసంధానం కీలకం**

పాండురంగాపురం–సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పనులు ప్రారంభం, సత్తుపల్లి–కొవ్వూరు రైల్వే లైన్‌కు నిధుల మంజూరు, పెనుబల్లి–కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గానికి మంజూరు లభిస్తే భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి ఖమ్మం ప్రాంతాల రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. యాత్రికులు, ప్రయాణికులతో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కూడా ఈ రైల్వే అనుసంధానాలు ప్రయోజనం చేకూర్చనున్నాయి .మంత్రి తుమ్మల చేసిన విజ్ఞప్తులకు కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి ప్రత్యేక బృందాలను పంపిస్తామని, సంబంధిత అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం పట్ల ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# ఫ్రూట్ జ్యూస్‌లు (పండ్ల రసాలు), వెజిటేబుల్ జ్యూస్‌లు (కూరగాయల రసాలు) ఆరోగ్య ప్రయోజనాలు





ఫ్రూట్ జ్యూస్‌లు (పండ్ల రసాలు), వెజిటేబుల్ జ్యూస్‌లు (కూరగాయల రసాలు) తాగడం వల్ల శరీరానికి బోలెడన్ని పోషకాలు అందుతాయి. అయితే, ఆరోగ్యం పరంగా వీటిని ఎలా తాగాలో, వాటి వెనుక ఉన్న ఆరోగ్య రహస్యాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం:

**1. ఫ్రూట్ జ్యూస్ (Fruit Juice) – తక్షణ శక్తికి మార్గం**

పండ్ల రసాలలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

* తక్షణ శక్తి: అలసటగా ఉన్నప్పుడు ఒక గ్లాసు ఫ్రూట్ జ్యూస్ తాగితే శరీరానికి వెంటనే గ్లూకోజ్ అంది, శక్తి వస్తుంది.

* చర్మ సౌందర్యం: నారింజ, బత్తాయి, దానిమ్మ వంటి రసాలలో ఉండే విటమిన్–సి చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది.

*గమనిక: పండ్లను రసంగా మార్చినప్పుడు అందులోని ఫైబర్ (పీచు పదార్థం) పోతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు (Blood Sugar) వేగంగా పెరుగుతాయి. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు ఫ్రూట్ జ్యూస్‌లకు దూరంగా ఉండటం లేదా వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.



**2. వెజిటేబుల్ జ్యూస్ (Vegetable Juice) – ఆరోగ్య సంజీవని**

క్యారెట్, బీట్‌రూట్, సొరకాయ, పాలకూర, పుదీనా వంటి కూరగాయల రసాలు అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి.

* బరువు తగ్గడం & డిటాక్స్: వెజిటేబుల్ జ్యూస్‌లలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్స్ (వ్యర్థాలను) బయటకు పంపి, బరువు తగ్గడానికి సహాయపడతాయి.

* రక్తహీనత దూరం: బీట్‌రూట్, క్యారెట్, పాలకూర జ్యూస్‌లు తాగడం వల్ల శరీరంలో రక్తం (హిమోగ్లోబిన్) పెరుగుతుంది.

* బీపీ నియంత్రణ: సొరకాయ, దోసకాయ రసాలు శరీరానికి చలవ చేయడమే కాకుండా, రక్తపోటును అదుపులో ఉంచుతాయి.

**జ్యూస్‌లు తాగేటప్పుడు పాటించాల్సిన ముఖ్యమైన నియమాలు:**

* చక్కెర కలపవద్దు: జ్యూస్‌లలో విడిగా చక్కెర (Sugar) అస్సలు కలపకూడదు. సహజసిద్ధమైన రుచినే ఆస్వాదించాలి.

* ఫిల్టర్ చేయకండి: జ్యూస్ చేసిన తర్వాత వడకట్టకుండా (Without filtering) తాగితే కొద్దిగానైనా పీచు పదార్థం శరీరానికి అందుతుంది.

* తాజాగా తాగండి: జ్యూస్ చేసిన 15–20 నిమిషాల లోపు తాగేయాలి. నిల్వ ఉంచితే పోషకాలు నశిస్తాయి.

* అతిగా వద్దు: రోజుకు ఒక గ్లాసు (సుమారు 150–200 ml) జ్యూస్ సరిపోతుంది. జ్యూస్‌ల కంటే నేరుగా పండ్లు, కూరగాయలను నమిలి తినడమే ఆరోగ్యానికి అన్నిటికంటే ఉత్తమమైన మార్గం.

# గోల్డ్ జ్యువెలరీ షాపుల మాటున తాకట్టు దందా?

- సామాన్యుల బంగారంపై భారీ వడ్డీ వసూళ్ల ఆరోపణలు
- ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ సంస్థలకు బంగారం మళ్లింపు జరుగుతోందా?
- లైసెన్సులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అధికారుల తనిఖీలు ఎక్కడ







**అశ్వారావుపేట, సెప్టెంబర్ 20 ప్రజాజ్యోతి :** బంగారు నగల వ్యాపారం పేరుతో కొందరు వ్యాపారులు తాకట్టు వ్యాపారం కూడా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. జ్యువెలరీ షాపులను ఆసరాగా చేసుకుని సామాన్యుల నుంచి బంగారం తాకట్టు పెట్టించుకుని అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నూటికి రెండు రూపాయల వడ్డీ?**

సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకుని బంగారం తాకట్టు పెట్టుకుని నూటికి రెండు రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదే బంగారాన్ని తర్వాత ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ సంస్థల్లో తక్కువ వడ్డీకి తాకట్టు పెట్టి మధ్యలో వడ్డీ వ్యత్యాసం ద్వారా లాభాలు పొందుతున్నారనే ప్రచారం కూడా ఉంది.ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? సంబంధిత వ్యాపారులకు తాకట్టు రుణాలు ఇచ్చే అనుమతులు, లైసెన్సులు ఉన్నాయా? ఉంటే ఎలాంటి నిబంధనల కింద ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**బంగారానికి తక్కువ విలువ.. రుణంలో భారీ తేడా?**

సామాన్యుడు తన బంగారాన్ని తాకట్టు పెట్టినప్పుడు మార్కెట్ విలువతో పోలిస్తే కేవలం 50–60 శాతం విలువ ఆధారంగా డబ్బులు ఇస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. మరోవైపు అదే బంగారాన్ని ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక విలువకు తాకట్టు పెట్టి ఎక్కువ మొత్తంలో రుణం పొందుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**గోల్డ్ మోసం కేసుతో సంబంధం ఉందా?**

ఇటీవల వెలుగులోకి వచ్చిన బంగారం మోసం వ్యవహారంలో కొందరు వ్యక్తులు బంగారాన్ని ఒకచోట తాకట్టు పెట్టి, తిరిగి ఇతర ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో స్థానికంగా నిర్వహిస్తున్న తాకట్టు వ్యాపారాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**లైసెన్సులపై తనిఖీలు జరిగాయా?**

జ్యువెలరీ వ్యాపారం నిర్వహించడానికి ఉన్న అనుమతులు, తాకట్టు/రుణ వ్యాపారం నిర్వహించడానికి అవసరమైన చట్టపరమైన అనుమతులు ఒకటేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సామాన్యుడికే ఎందుకు భారం?**

అత్యవసర సమయంలో బంగారం తాకట్టు పెట్టి డబ్బు తీసుకునే సామాన్యుడు అధిక వడ్డీ భారం మోయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్తులతో ఉన్న మంచి సత్సంబంధాల వల్ల ఏ టైం వెళ్లిన రుణాలు ఇస్తారనే ఒక ఆశతోని వీరి వద్దకు వెళుతుంటే వీరు చేసే మోసాలు ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని కొందరు వాపోతున్నారు ఒకవైపు తక్కువ మొత్తానికి బంగారం తీసుకుని, మరోవైపు అదే బంగారాన్ని అధిక విలువకు ఆర్థిక సంస్థల్లో తాకట్టు పెడితే మధ్యలో లాభం ఎవరికీ? తాకట్టు వ్యాపారస్తుడికి లాభం నష్టపోయేది మాత్రం సామాన్యుడే అని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

## గొంతు నులిమి వృద్ధురాలి హత్య

- అనంతరం బంగారం అపహరణ..!
- భద్రాద్రి అశ్వాపురంలో కలకలం
- దర్యాప్తులో పోలీసులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/అశ్వాపురం సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి :** – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం తుర్రం వారిగూడెం గ్రామంలో ఆదివారం దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జర్పుల సువాలి (60) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గుర్తుతెలియని దుండగులు ఆమె గొంతు నులిమి హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఒంటరిగా ఉన్న సమయంలో దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర భయాందోళన నెలకొంది. సమాచారం అందుకున్న అశ్వాపురం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేపట్టారు. బంగారం కోసమే హత్య జరిగిందా..? లేక మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## యాక జయమ్మకు "అక్షర కిరీటి" పురస్కారం



**చర్ల, సెప్టెంబర్ 20: (ప్రజా జ్యోతి):** విద్యారంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న చర్ల మండలం తేగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని శ్రీమతి యాక జయమ్మకు "అక్షర కిరీటి" పురస్కారం లభించింది. భద్రాచలంలోని పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 176వ జాతీయ సమ్మేళనంలో ఆమెను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యాక జయమ్మకు "అక్షర కిరీటి" ప్రశంసా పత్రంతో పాటు మెమొంటోను అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు జీవశాస్త్ర బోధన, పాఠశాల అభివృద్ధికి ఆమె చేస్తున్న సేవలను నిర్వాహకులు అభినందించారు.పురస్కారం లభించిన సందర్భంగా తేగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, చర్ల మండల ఉపాధ్యాయులు, తేగడ గ్రామపంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, సన్నిహితులు, ఆత్మీయులు యాక జయమ్మకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు ఇలాంటి పురస్కారాలు మరింత స్ఫూర్తినిస్తాయని వారు అన్నారు.

## బీజాపూర్‌లో బస్సు బోల్తా

- 16 మందికి గాయాలు





**చర్ల, సెప్టెంబర్ 20 : (ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తారెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమారు 16 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. వీరిలో 13 మంది పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నారు. మరో ముగ్గురికి బాసగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు.చర్ల వైపు వెళ్లేందుకు ఉదయం సుమారు 8 గంటలకు బయలుదేరిన బస్సు గుండం ప్రాంతానికి చేరుకోగానే అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే గుండం ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ బలగాలు, తారెం పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను కిటికీల ద్వారా బయటకు తీసి, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

- సామ అంజిరెడ్డి



**చర్ల, సెప్టెంబర్ 20 : (ప్రజా జ్యోతి)** చర్ల మండలంలోని రైతు వేదికలో ఆదివారం మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామ అంజిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం హైదరాబాద్‌లోనే కేటాయించాలని, రూ.25 వేల నెలవారీ పెన్షన్ అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు అపరిమిత వైద్య సౌకర్యాలతో కూడిన హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందించాలని, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో నాయకత్వం వహించిన వారితో పాటు ఉద్యమంలో పాల్గొని కేసులు ఎదుర్కొన్నవారు, బైండోవర్లు అయినవారు, జైలుకు వెళ్లిన వారందరినీ ప్రభుత్వం గుర్తించి సమన్యాయం చేయాలని అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో అర్హులైన ఉద్యమకారులందరికీ అవకాశం కల్పించాలని కోరారు.ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు అందుతున్న గౌరవం, సంక్షేమ పథకాల తరహాలో తెలంగాణ ఉద్యమకారులకు కూడా తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని అన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి పెరుమాళ్ల రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పోలు సోమయ్య, కొట్టె నాగేశ్వరరావు,ఫాహీం, తరుణ్ రెడ్డి, కూరాటి శ్రీరాజు, ఏరుకొండ మురళి, శ్రీనివాసరావు, పందింళ్లపల్లి వెంకటేశ్వర్లు, రమణ, రఘు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కవితా ప్రతిభకు కిరీటం

- ప్రదీప్ కుమార్‌కు అక్షర కిరీటి బిరుదు



**చర్ల, సెప్టెంబర్ 20: (ప్రజాజ్యోతి):** ఎటపాకలోని పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం 176వ శ్రీశ్రీ కళావేదిక జాతీయ ద్విశతాధిక కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఐఏఎస్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, జాతీయ ప్రణాళిక అధికారి పార్థసారథి, కళావేదిక ప్రతినిధి జి. వరలక్ష్మి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మందికి పైగా కవులు ఈ కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితా గానాలను వినిపించారు. చర్ల మండలానికి చెందిన కవి కొంగూరు ప్రదీప్ కుమార్ 'నా పల్లె కష్టాలు' అనే కవితను ఆలపించారు.కవితా ప్రదర్శన అనంతరం ప్రదీప్ కుమార్‌ను 'అక్షర కిరీటి' బిరుదుతో ఘనంగా సత్కరించారు. భక్త రామదాసు వంశీయుల చేతుల మీదుగా జ్ఞాపిక, శాలువాతో సన్మానం చేశారు. ప్రదీప్ కుమార్‌కు అక్షర కిరీటి బిరుదు లభించడంపై చర్ల మండలంలోని కవులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

## ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



**ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 20 (ప్రజాజ్యోతి)** సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు, కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఆళ్ళపల్లి మండలం జిన్నెలగూడెం గ్రామంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి బట్టు ప్రసాద్, ఏఐకేఎంఎస్ మండల నాయకులు వాగబోయిన రాంబాబు, వాగబోయిన వసంతరావు, చాట్ల లక్ష్మీనర్సు, మద్దెల సమ్మయ్య, పెనక కృష్ణ, వాగబోయిన చుక్కమ్మ, వర్స జ్యోతి, పెనక నాగమణి, పెనక రమణ, వాగబోయిన లక్ష్మి పాల్గొన్నారు.

## చిన్నారుల ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం



**చర్ల, సెప్టెంబర్ 20(ప్రజాజ్యోతి):** వినాయక నవరాత్రుల సందర్భంగా చర్ల ఆయిల్ బంక్ ఏరియాలో చిన్నారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం పూజా కార్యక్రమాలను ముగించుకుని గణనాథుడిని ఘనంగా ఊరేగించి తాలిపేరు నదిలో నిమజ్జనం చేశారు.ఆయిల్ బంక్ ఏరియాలో కొన్ని దశాబ్దాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ చిన్నారులు స్వయంగా ముందుకు వచ్చి ఐదు రోజుల పాటు గణపతి నవరాత్రి ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. పురోహితులు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నైవేద్య కార్యక్రమాలు నిర్వహించారు.ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న బొజ్జ గణపయ్యను శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తాలిపేరు నది వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అనంతరం చిన్నారుల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ చిన్నారులు స్వయంగా ముందుకు వచ్చి సంప్రదాయాలను కొనసాగిస్తూ వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్న వయసులోనే భక్తి, ఐక్యత, సేవాభావాన్ని అలవర్చుకోవడం ఇతర చిన్నారులకు స్ఫూర్తిదాయకమని అన్నారు .ఈ కార్యక్రమంలో శివరాజు, జోషిక, కార్తికేయ, డమరుతి, ధృవ, నిఖిల్, అభి తదితర చిన్నారులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ నుంచి జారిపడి యువకుడి మృతి

- ఫిట్స్ రావడంతో అదుపుతప్పి కిందపడిన కార్మికుడు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని జిన్నగట్ట సమీపంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది.ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న ఓ యువకుడికి మార్గమధ్యలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి ట్రాక్టర్ నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటనతో ఉప్పుసాక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఉప్పుసాక గ్రామానికి చెందిన సున్నం శివాజీ (25) సీతారామ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు.ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై వెళ్తుండగా జిన్నగట్ట సమీపంలోకి చేరుకున్న సమయంలో శివాజీకి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చినట్లు సమాచారం. దీంతో అదుపుతప్పి ట్రాక్టర్ నుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో శివాజీకి తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే స్పందించిన సహచరులు, స్థానికులు శివాజీని చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.చిన్న వయసులోనే శివాజీ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.6.80 లక్షల చెక్కుల అందజేత
- వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి :** పేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.శనివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన రూ.6 లక్షల 80 వేల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నారని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, నాయకులు పాతూరి వెంకన్న, అబ్దుల్లా, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొనడంతో ఆటో బోల్తా.. ప్రయాణికుడు మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి):** లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలోని శ్రీరాంపురం వెస్ట్‌గేట్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక నుంచి పాల్వంచ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను శ్రీరాంపురం వెస్ట్‌గేట్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో పినపాక మండలం టి.కొత్తగూడెం గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశ్వర్లు (55) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారు. గద్దల శివకుమార్ (33)కు చెయ్యి, కాలికి ఫ్యాక్చర్లు కాగా, ఆటో డ్రైవర్‌కు తలతో పాటు చేతికి గాయాలయ్యాయి. మరో ప్రయాణికుడికి కూడా గాయాలైనట్లు తెలుస్తోంది.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఆటో నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో కొద్దిసేపు రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహాలక్ష్మమ్మ కాలనీలో వైభవంగా దీపోత్సవం

- భక్తిశ్రద్ధలతో గణపతికి ప్రత్యేక పూజలు.. ఆధ్యాత్మిక శోభతో మెరిసిన కాలనీ



**బూర్గంపహాడ్,నవంబర్ 20, (ప్రజా జ్యోతి ):** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బూర్గంపహాడ్ మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మమ్మ కాలనీలో టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు దీపోత్సవంలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా అంటూ భక్తుల నినాదాలతో మహాలక్ష్మమ్మ కాలనీవాసులు దీపాలను వెలిగించారు.వేలాది దీపాల వెలుగులతో కాలనీ మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.చిన్నారులు,యువత,మహిళలు,పెద్దలు ఉత్సాహంగా పాల్గొని దీపాలను వెలిగిస్తూ గణనాథునికి భక్తిని చాటుకున్నారు. దీపాల వెలుగులు, గణపతి నామస్మరణలతో కాలనీ అంతా పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి,విఘ్నాలను తొలగించి గ్రామ ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపోత్సవ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ దీపోత్సవం కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు గణపతి నవరాత్రి ఉత్సవాల వైభవాన్ని మరింత పెంచింది.ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## మణుగూరుకు అంతర్జాతీయ ఖ్యాతి

- ఐకాన్ గ్లోబల్ అవార్డులు సొంతం
- కేతవాన్ లో ఘనత..! కరాటే మాస్టర్ కాశీమల్ల
- కు నంది అవార్డు..!! చిన్నారులకు స్టార్ కిడ్ అవార్డులు
- కరాటే విద్యార్థుల ప్రతిభకు జాతీయ గుర్తింపు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి :** –భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన కరాటే క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఆదివారం కేతవాన్ నైట్రీ కాంప్లెక్స్ లో జరిగిన ఐకాన్ గ్లోబల్ ఎక్స్ లెన్స్ అవార్డు కార్యక్రమంలో మణుగూరుకు చెందిన సీనియర్ లేడీ కరాటే మాస్టర్ కాశీమల్ల నాలుగోవ డాన్ బ్లాక్ బెల్ట్ కు ఐకాన్ గ్లోబల్ మాస్టర్ నంది అవార్డు లభించింది. అలాగే ఆమె శిష్యులు గుగులోత్ అశోక్ మొదటి డాన్ బ్లాక్ బెల్ట్, జతీన్, యోమిని మొదటి డాన్ బ్లాక్ బెల్ట్ లకు ఐకాన్ గ్లోబల్ స్టార్ కిడ్ అవార్డులు దక్కాయి. అవార్డులు పొందిన వారిని మాస్టర్, తల్లిదండ్రులు అభినందించారు.

# గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పి ఆర్ జి టీ ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఏర్పాటు
- 24 మంది సభ్యులతో నూతన కార్యవర్గం






**పాల్వంచ, సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పి ఆర్ జి టీ ఏ) ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీలకు చెందిన ఉపాధ్యాయులతో జిల్లా కమిటీ నిర్మాణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది సభ్యులతో పి ఆర్ జి టీ ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా కమిటీ అధ్యక్షులుగా కొప్పుల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నల్లమల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దాసరి సరిత, గౌరవ అధ్యక్షులుగా గంగావతి వెంకటేష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా కె. మేరీ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలాజీ, వి. గోపి, ఎ. బాషాలను ఎన్నుకున్నారు.

### ఉపాధ్యాయుల హక్కుల కోసం సమిష్టి కృషి

ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. అన్ని గురుకుల సొసైటీల ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ జి టీ ఏ ఆధ్వర్యంలో నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.

### కామన్ డైరెక్టరేట్, 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపుపై పోరాటం

సమావేశంలో పి ఆర్ జి టీ ఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ జి టీ ఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గురుకుల వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి ఉమ్మడి గురుకులాల కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు, 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, కేర్‌టేకర్ల నియామకం వంటి ప్రధాన అంశాలపై సంఘం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

### జిల్లా కమిటీ బలోపేతంతో సమస్యల పరిష్కారానికి కృషి

నూతన జిల్లా కమిటీ ఏర్పాటుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు మరింత బలోపేతంగా పనిచేస్తామని పి ఆర్ జి టీ ఏ రాష్ట్ర నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుర్రం రమేష్ గౌడ్, నిర్మలానందం, ఉప్పు అశోక్, రామకృష్ణారెడ్డి, కమటం నాగేశ్వరరావు, పానుగంటి విజయ్, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, పగుడాల నరసింహ, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

## వయసును, వాతావరణాన్ని లెక్కచేయకుండా.. టెన్నిస్ కోర్టులో సీనియర్ల జోరు

- శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సహకారంతో ఏ ఐ ఎస్ టీ ఏ –2026 పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగింపు







**పాల్వంచ, సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి :** పాల్వంచ–కొత్తగూడెం జంట నగరాల వేదికగా శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఏ ఐ ఎస్ టీ ఏ–2026 సీనియర్ టెన్నిస్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన సీనియర్ క్రీడాకారులు వయస్సును, వాతావరణ పరిస్థితులను ఏమాత్రం లెక్కచేయకుండా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొంటున్నారు. వయస్సు పెరిగినా ఆటపై ఆసక్తి, పట్టుదల ఏమాత్రం తగ్గలేదని పలువురు సీనియర్ క్రీడాకారులు తమ ఆటతీరుతో చాటుతున్నారు. టెన్నిస్ కోర్టులో ప్రత్యర్థులుగా తలపడుతున్నప్పటికీ, ఆట ముగిసిన అనంతరం స్నేహపూర్వకంగా మెలుగుతూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. పోటీల సందర్భంగా క్రీడాకారుల మధ్య ఉత్సాహం, పరస్పర అభినందనలు సందడి వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి.

### జాతీయ స్థాయి పోటీల నిర్వహణపై ప్రశంసలు

ఇదిలా ఉండగా, టోర్నమెంట్ నిర్వాహకులు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు అందిస్తున్న వసతులు, ఇతర ఏర్పాట్లపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాల్వంచ–కొత్తగూడెం జంట నగరాల్లో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను ప్రశంసించారు. క్రీడల అభివృద్ధికి, సీనియర్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. వయస్సు కేవలం సంఖ్య మాత్రమేనని చాటుతూ క్రీడాకారులు ప్రదర్శిస్తున్న ప్రతిభ యువతకు స్ఫూర్తినిస్తోంది.

## పాల్వంచ కరకవాగులో అగ్నిప్రమాదం

- ఇల్లు పూర్తిగా దగ్ధం
- షార్ట్ సర్క్యూట్‌తో భారీ నష్టం
- సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం
- ప్రభుత్వ సాయం కోసం బాధిత కుటుంబం వేడుకోలు

**పాల్వంచ, సెప్టెంబర్ 20, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని కరకవాగు ప్రాంతంలో శనివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ముబీన్ మహమ్మద్‌కు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

### ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం

శనివారం రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ముబీన్ మహమ్మద్ పాల్వంచలోనే ఉన్నారు. ఆయన భార్య సిద్దిపేటలోని బంధువుల ఇంటికి వెళ్లినట్లు సమాచారం. ఇంట్లో మంటలు చెలరేగడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ముబీన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ముబీన్ హుటాహుటిన తన ఇంటికి చేరుకునేలోపే ఇల్లు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి, వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

### కట్టుబట్టలతో రోడ్డున పడ్డ కుటుంబం

అగ్నిప్రమాదంతో ఇల్లు, ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధం కావడంతో ముబీన్ కుటుంబం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. కట్టుబట్టలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు వాపోయారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

### ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి

అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ముబీన్ మహమ్మద్ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.. అగ్నిప్రమాదంతో నిరాశ్రయులైన కుటుంబానికి పునరావాసం, ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి



- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 20, ( ప్రజా జ్యోతి)** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సర్వం కోల్పోయి రోడ్డున పడిన నిరుపేద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కోరారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ పట్టణం కారకవాగు పరిధిలో మొహమ్మద్ ముబీన్ ఏహ్మద్ నివాసంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, లక్ష రూపాయల నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ధ్రువీకరణ పత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో ప్రాణనష్టం తప్పినప్పటికీ, సర్వస్వం బూడిదై కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలి దిక్కుతోచని స్థితిలో ఉండగా ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దగ్ధమైన ఇంటిని, సామగ్రిని పరిశీలించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ నిరుపేద కుటుంబం ఇలాంటి భారీ ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమన్నారు. జీవితాంతం కష్టపడి కూడబెట్టుకున్న సర్వస్వం అగ్నికి ఆహుతి కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు వెంటనే స్పందించి సంభవించిన ఆస్తి నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ఆర్థిక సహాయం విడుదల చేసి, బాధితులకు గృహ నిర్మాణంతో పాటు జీవనోపాధి కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి తాము అన్నివిధాలా అండగా నిలుస్తామని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు స్పందించి సాయహం అందించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, గౌస్ పాషా, బట్టు హరి, హుస్సేన్, రామకృష్ణ, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.